నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం | మే 22, 2024 | www.navatelangana.com

మరోమారు ఇంచార్జీతేనే సరి

టీయూ వీసీగా సందీప్‌సుల్తానియ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సదీప్ సుల్తానియా

తెలంగాణ యూనివర్సిటీకి మరోసారి ఇన్‌చార్జి వీసీనే నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. వీసీలను నియమించనున్నట్టు ప్రకటన రావడంతో ఈసారి టీయూకు రెగ్యూలర్ వీసీ వస్తారని అంతా భావించారు. కానీ మరోసారి ఇన్‌చార్జి వీసీనే నియమించడం గమనార్హం. తాజాగా ఇన్‌చార్జి వీసీగా సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ సుల్తానియాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల వరకు ఇన్‌చార్జి వీసీగా ఉన్న బుర్రవెంకటేశం స్థానంలో సందీప్ సుల్తానియ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇన్చార్జిలు కాకుండా పర్మినెంట్ వీసీని నియమిస్తే యూనివర్సిటీలు గాడిలో పడే అవకాశం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు వీసీలను నియమించింది.

సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నగరంలోని వినాయక్‌నగర్‌లోని సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 8.00 ఎంవీఏ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో లోడ్ పెరగడంతో విద్యుత్‌శాఖ సీఎండీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారని, దీనిని పెట్టడం ఇదే తొలిసారని విద్యుత్ అధికారులు తెలిపారు. దీంతో వినాయక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల శ్రీనగర్ కాలనీ, గాయత్రి నగర్, కోటగల్లి, న్యాల్‌కల్ రోడ్డు, చంద్రనగర్, 100 ఫీట్ రోడ్డు, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, పాతిగల్లి, యాదగిరి బాగ్, గూడెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని ఎస్ఈ రవీందర్ తెలిపారు. డీఈ రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో నిర్వహించగా.. విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్త మండలాల్లో

కార్యాలయాలెన్నడో..?

- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు
- కార్యాలయాల ఏర్పాటుపై మండల వాసుల ఎదురుచూపులు

నవతెలంగాణ-బోధన్

గత ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసం పునర్విభజనలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేసిన విషయం విధితమే. దాని అనంతరం సైతం స్థానిక ప్రజల, నాయకుల డిమాండ్‌ల మేరకు మరికొన్ని మండలాలను ఏర్పాటు చేసింది. వాటిల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఆలూర్, డొంకేశ్వర్, పోతంగల్, సాలూర మండలాలను ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉంది. కానీ ఇటీవల ఏర్పాటయిన కొత్త మండలాలలో ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయకపోవడంతో ఆయా మండల ప్రజలు నిరాశ చెందుతున్నారు. కొత్త మండలం ఏర్పాటు సందర్భంగా రెవెన్యూ విభాగాన్ని ఉమ్మడి మండల నుంచి వేరు చేసి కొత్త మండలాల్లో రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఒక్కటి తప్ప ఇతర కార్యాలయాలు ఏవి కూడా ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో మండల వాసులు నిరాశ చెందుతున్నారు.

ఆర్మూర్ మండలం ఆలూరు, నందిపేట మండలం డొంకేశ్వర్, కోటగిరి మండలం పోతంగల్, బోధన్ మండలం సాలూర గ్రామాలు కొత్త మండల ఆయన మండల వాసులు వారి పనుల నిమిత్తం ఉమ్మడి మండలాలకే వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఇతర ఇతర సమస్యలు పరిష్కారానికి జనం ఇప్పటికీ ఉమ్మడి మండలాలకి వెళ్లడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త మండలం ఏర్పాటు అయిన సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు స్థానికంగా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఆర్థిక ఇబ్బందులను కాకుండా ఇతర ఇబ్బందులు లేకుండా ఉండవచ్చు.

బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండలం ఫిబ్రవరి 11, 2023న ప్రారంభం అయింది. మండలం ఏర్పడి సంవత్సరానికి పైనే అయిన ఎలాంటి పురోగతి లేదు. మండల తహసిల్దార్ కార్యాలయం ఏర్పాటు కావడంతో రిజిస్ట్రేషన్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలు మాత్రమే ప్రజలకు అందుతున్నాయి. అలాగే మండల పరిషత్ కార్యాలయం, ఐకెపి, పోలీస్ స్టేషన్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడంతో వాటి పనుల కోసం జనం బోధన్ మండలానికి వెళ్లవలసి వస్తుంది. మహిళా సంఘాలు సమీక్షలు, సంఘాల పనితీరుపై సమావేశాలు నిర్వహించడానికి ఐకెపి కార్యాలయం లేక బోధన్ మండలానికి వెళ్ళవలసి వస్తుంది. అలాగే ఘర్షణలు, కుటుంబ కలహాలు, వివాదాలు జరిగినప్పుడు నిరుపేదలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి న్యాయం పొందడానికి బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ కు వెళుతున్నారు. దాంతో సకాలంలో వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండల విద్యాశాఖ కార్యాలయం లేక పాఠశాలల పనితీరుపై పర్యవేక్షణ కరువై విద్యావ్యవస్థ గాడితప్పుతుంది. అలాగే ఉపాధి హామీ పనులు పరిశీలనకు, కూలీలకు కావలసిన సౌకర్యాలు పరిరక్షించడానికి, కూలీలకు మరిన్ని సేవలు కల్పించడానికి ఉపాధి హామీ కార్యాలయం లేక బోధన్ కు వెళ్ళవలసి వస్తుంది. రైతులకు నాణ్యమైన సేవలు అందించడానికి వ్యవసాయ శాఖ కార్యాలయం లేక బోధన్‌కు వెళుతున్నారు. దాంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో నష్టపోతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే కొత్త మండలంలో కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మండల కార్యాలయం ఏర్పాటు అయ్యేనా..?

మండల ప్రధాన కేంద్రంలో ప్రజలకు మరింత పాలన అందించడానికి అతి ముఖ్యమైనది మండల పరిషత్ కార్యాలయం. ఈ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవో, ఉపాధిహామీ, ఐకేపీ, పంచాయతీరాజ్, మండల విద్యాశాఖ, తదితర శాఖల ఉద్యోగులతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు మంజూరు చేయడానికి ఎంపీపీ విధులు నిర్వహిస్తుంటారు .ఇంతటి కీలకమైన కార్యాలయం ప్రతి మండలంలో తప్పనిసరిగా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. మండలం ఏర్పడిన సంవత్సరం అయిన ప్రభుత్వం మాత్రం కార్యాలయాలను ఏర్పాటు చేయకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పైన వైద్య సిబ్బంది సౌకర్యార్థం గదులు నిర్మించారు.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడం, ఎన్నికలు పూర్తయితే ఈ భవనం నుండే ఎంపీడీఓ కార్యాలయం, ఎంపీపీ విధులు నిర్వహించే సౌలభ్యం ఉంది.

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు

ప్రభుత్వం జూన్, జూలై చివరి వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి సమాయత్తమవుతున్నట్లు ప్రచారం నెలకొంది. అలాగే ప్రభుత్వం అధికారుల నుండి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి కావలసిన సమాచారాన్ని సేకరిస్తున్నారు. దాంతో సర్పంచ్ , ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు జరుగుతాయనే నమ్మకం ప్రజలలో నెలకొంది. ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు పూర్తయిన తర్వాత మండల పరిషత్ అధ్యక్షుని ఎన్నిక జరుగుతుంది. అనంతరం కొత్త మండలంలో పాలన చేపట్టడానికి కార్యాలయాన్ని ఏర్పాటుచేయవలసి ఉంటుంది. అంతవరకు ఉమ్మడి మండలంలోనే వేరువేరుగా నామినేషన్‌లు, దరఖాస్తులు చేసుకోవలసి ఉంటుంది.



లారీ అన్‌లోడ్ చేస్తలే

- అధిక తరుగు ఇస్తేనే దించుకుంటారటా : సొసైటీకి తరలివచ్చిన రైతులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మాట్లాడుతున్న రైతులు

తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్ అన్‌లోడ్ చేయడం లేదని రైతులు వాపోయారు. ఎల్లారెడ్డిని సొసైటీకి మంగళవారం పలువురు రైతులు వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు తడిచిన ధాన్యం సైతం సేకరించాలని, మద్దతు ధరకే తీసుకోవాలని సీఎం ఆదేశాలిస్తుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం తమకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 రోజుల క్రితం లింగారెడ్డిపేట్ కొనుగోలు కేంద్రం నుండి సుమారు 10మంది రైతులకు చెందిన వరి ధాన్యం సేకరించి ఒక లారీలో లోడ్ చేసి పంపారని, అందులో ఒకరిద్దరి ధాన్యంలో స్వల్ప నాణ్యత లోపం ఉందంటూ ఆ లారీని అన్‌లోడ్ చేయకుండా నిలిపివేశారని వాపోయారు. ధాన్యంలో స్వల్ప నాణ్యత లోపం ఉందని అదనంగా ధాన్యం తరుగుకు రైతులు అంగీకరిస్తేనే లారీని అన్‌లోడ్ చేయిస్తామనడం సరికాదని, రైతులను నాణ్యత లోపం పేరుతో ఈ విధంగా ముంచద్దని వాపోయారు. రైతులు రైసుమిల్లర్ల తీరును ఖండించారు. రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేస్తామని చెప్పడం ప్రకటనలకే పరిమితం అవుతుందని విమర్శించారు. ఏదేమైనాప్పటికీ ప్రభుత్వం చెప్పుతున్న దానికి చేస్తున్న దానికి పొంతనలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సిగరెట్ గోదాములే

వారి టార్గెట్

- అంతర్రాష్ట్ర సిగరెట్ దొంగల అరెస్ట్
- ఎనిమిది లక్షల నగదు, కారు, మూడు సెల్ ఫోన్లు, గడ్డపార, ఒక స్క్రూ డ్రైవర్ స్వాధీనం

నవతెలంగాణ-కామారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజి మార్కెట్ లో ఉన్న శ్రీ రాఘవేంద్ర టెండర్స్‌కు చెందిన సిగరెట్ గోదాంలో నుండి మే 2న తెల్లవారుజాము సుమారు రెండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు గోదాం తాళాలు పగలగొట్టి ఎనిమిది సిగరెట్ కార్టూన్ డబ్బాలను దొంగలించినట్లు రాఘవేంద్ర టెండర్స్ యజమాని శశిధర్ కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఆ కేసు నమోదు చేసుకొని పోలీసులు బందాలుగా ఏర్పడి ఈ కేసును చేదించినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సిగరెట్ దొంగలను కామారెడ్డి పోలీసులు మంగళవారం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, సరైన సమాచారంతో కామారెడ్డి ఏరియాలో గల సిరిసిల్ల బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా దొంగలను పట్టుకున్నట్లు కామారెడ్డి ఎస్పి సింధు శర్మ తెలిపారు.

గత కొద్ది రోజుల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిగరెట్ గోదాం నుండి సిగరెట్ డబ్బాలను దొంగలించినట్లు గోదాం యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, ఎన్నికల విధులు ఉన్నప్పటికీ కేసు దర్యాప్తును ప్రారంభించి పది, పదిహేను రోజులుగా కామారెడ్డి పోలీసులు బందాలుగా ఏర్పడి చివరికి మంగళవారం రోజున దొంగలను పట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఏవన్ ముద్దాయి అయినా కుమవత్ భుందరాం ఇతడు రాజస్థాన్ కు చెందిన వ్యక్తి, కాగా ప్రస్తుత నివాసం సంగారెడ్డి జిల్లా , పటాన్ చెరువులో కిరాణా వ్యాపారం చేసుకుంటాడని, ఎ2 కుమార్ ఇతడు రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి కాగా ప్రస్తుతం హైదరాబాదులో డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. ఏ 3 కుమావత్ గన్ శామ్ ఇతడు పరారీలో ఉన్నాడన్నారు. వీరి వద్ద నుండి నగదు ఎనిమిది లక్షలు, బ్యాంక్ అకౌంట్ లో 7,50,000, షిఫ్ట్ కార్, మూడు సెల్ఫోన్లో, ఒక గడ్డపర, ఒక స్క్రూ డ్రైవర్ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు మొత్తంగా ఎనిమిది చోట్ల దొంగతనాలు చేశారని, అందులో ఒకటి కర్ణాటక రాష్ట్రంలో చేయగా, మిగిలిన ఏడు దొంగతనాలు తెలంగాణ రాష్ట్రంలో నకిరేకల్, రాచకొండ పరిధి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, సైబరాబాద్ అమనంగల్, వరంగల్ టౌన్, వనపర్తి రూరల్, వరంగల్ కే యూ సి లలో చేశారన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఎంతటి దొంగల నైనా పట్టుకోవడం సాధ్యమవుతుందని ఎవరైనా ఆపద సమయంలో కానీ అనుమానితులు కనిపించిన సమయంలో నేరం జరిగిన వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని లేదా సమాచారాన్ని దగ్గర పోలీస్ స్టేషన్కు అందించాలని అప్పుడే దొంగలను పట్టుకొనడానికి సులవుతుం దని ఆమె అన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి వీరిని పట్టుకున్న కామారెడ్డి సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి, సిసిఎస్ఐ లు ఉస్మాన్, మహేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు సాహిద్, కిషన్, సురేందర్, పోలీసులు గణపతి, రాజేందర్, శ్రవణ్, హోంగార్డులు నరేష్, కరుణాకర్, రాజు, విశ్వనాథ్, నరేష్, విట్టలను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు.



పట్టుబడ్డ డబ్బులు, ఫోన్లు

నాలుగురోజుల్లో పూర్తవ్వాలి

- మిగిలిన 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సకాలంలో పూర్తి చేయండి
- ఉమ్మడి జిల్లాల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న జిల్లాల ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్

జిల్లాలో మిగిలిన 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నాలుగు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేయవలసినదిగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. మంగళవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, జిల్లా పౌరసరఫరాలు, సహకార శాఖ, మార్కెటింగ్, రవాణ, వ్యవసాయ, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్ల వేగవంతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2.65 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఇందుకు సహకరించిన మిల్లర్లను ప్రశంసిస్తూ ఇంకా మిగిలిన 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు సహకరించాలని రైస్ మిల్లర్లను కోరారు. వాతావరణం పొడిగా ఉన్నందున రాబోయే నాలుగు రోజులలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయటకు ప్రతి కేంద్రానికి ప్రత్యేకాధికారులను నియమించి తహసీల్దార్, వ్యవసాయాధికారులు బాద్యులను చేస్తూ మానిటరింగ్ చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం రోజు వారి లక్ష్యం నిర్దేశించుకొని కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, మిల్లర్లతో సమన్వయము చేసుకుంటూ కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా సహకార, ఐకెపి అధికారులు రోజు కేంద్రాలను సందర్శించి ధాన్యం తూకం వేసిన నాలుగు గంటల్లో లోడింగ్ చేసి లారీల ద్వారా మిల్లులలకు తరలించి అక్కడ మరో 5 గంటల్లో అన్ లోడింగ్ అయ్యే విధంగా పర్యవేక్షించాలన్నారు. సకాలంలో లారీలు అందుబాటులో లేకపోతె రోడ్డు పై వెళ్లే లారీలను , ట్రాక్టర్లను అపి లోడింగ్ చేసి పంపాలని సూచించారు. నాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తి చేయకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోళ్ల విషయంలో అధికారులు, రైస్ మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేసి వంద శాతం కొనుగోలు పూర్తి చేయాలని చెప్పారు. భిక్కనూర్ మండలం అంతంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రైతులతో ముఖాముఖీ అయ్యారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయవలసినదిగా కేంద్రం నిర్వాహకులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రాజంపేట, బీబీపేట్, సదాశివనగర్, బిక్కనూర్ మండలాలలో ధాన్యం కుప్పలున్నాయని, ప్రతి రోజు 9 వేల మెట్రిక్ టన్నుల మేర వచ్చే నాలుగు రోజులలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేసేలా తహసీల్ధార్లు, వ్యవసాయాధికారులు పర్యవేక్షిస్తున్నా రన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం, డిసిఓ రమ్య, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, జిల్లా రవణాధికారి శ్రీనివాస్ రెడ్డి, సహకార శాఖ అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం 3.20 లక్షల మెట్రిక్ టన్నులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం సన్న రకం, దొడ్డు రకం వడ్లు కలుపుకొని ఆరు లక్షల మెట్రిక్ట్ టన్నుల పైగా ధాన్యం వస్తుందని అంచనా వేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఐకెపి ఆధ్వర్యంలో 23 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పిఎసిఎస్ ఆధ్వర్యంలో 327 వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఐకేపీ ఆధ్వర్యంలో ఏ ర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేశారు. ప్రస్తుతం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 124 కేంద్రాలలో వారి ధాన్యం కొనవలసి ఉంది.

ఈ సంవత్సరం ప్రభుత్వం దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేయవలసింది మూడు లక్షల ఇరవై వేల మెట్టనుల ధాన్యాన్ని, కొంతమంది రైతులు సన్న రకాలు వేసి వాటిని ప్రైవేటు వ్యా పారులకు విక్రయించారు. దీంతో ప్రభుత్వం కొనవాల్సింది మూడు లక్షల, ఇరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, సోమవా రం వరకు రెండు లక్షల 72,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యా న్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇక మిగిలిన ధాన్యాన్ని ప్ర భు త్వం కొనుగోలు చేయవలసి ఉంది. ఇప్పటివరకు ప్రభుత్వం కొ నుగోలు చేసిన ధాన్యానికి 599.99 కోట్ల రూపాయలు చె ల్లిం చవలసి ఉండగా, 539,97 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

- రోడ్డు ప్రమాదాల వేల సాయం చేస్తే కేసులుండవు
- ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-సదాశివనగర్



మాట్లాడుతున్న ఎస్పీ సింధు

రోడ్డు ప్రమాదాల మూలంగానే ఎక్కువ మంది చనిపోతు, గాయాల పాలవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. మంగళవారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద అశోక్ గార్డెన్‌లో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమర, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతివేగంగా, త్రిబుల్ రైడ్స్, హెల్మెట్ లేకపోవడం ,కారు లో సీటు బెల్టు వేసుకోక పోవడం, ఓవర్ లోడ్, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, వలన ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలిపారు. నేషనల్ హైవే 44 వెంబడి ఉన్న దాబాలు ,హొటల్స్, మెకానిక్ షాఫ్ లు ,పాన్ షాపులు తదితర దుకాణాలకు ఎస్పీ పలు సూచనలు అందించారు. ఎవరైన రోడ్డు ప్రమాదాలకు గురైతే అంబులెన్స్‌కు 100, 108, నెంబర్ లకు డయల్ చేయలని సూచించారు. ప్రమాదం జరిగిన రోడ్డు పై పడిన వారికి సహాయం చేసి సమాచారం అందిస్తే వారిపైన ఎలాంటి కేసులు నమోదు చేయబోరని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. డాక్టర్ ఆష్మా అఫ్రిన్ సిపిఆర్ గురించి వివరించారు. సిపిఆర్ విధానం ఎలా చేయాలో వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ట్రెయినింగ్ ఎస్పీ కాజల్, ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాస్ సిఐ సంతోష్ కుమార్. ఎస్సై రాజు , రెడ్ క్రాస్ సోసైటి అధ్యక్షుడు రాజన్న, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన సెంట్రల్ టీం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజీవాడి గ్రామ శివారులోని చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మంగళవారం సెంట్రల్ సెక్రటరీ టీం పరిశీలించింది. రైతు వేదికలో అగ్రికల్చర్ డిఫార్ట్ మెంట్ అధికారులతో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీసి పరిశీలించారు. వారి వెంట ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎం.పి.ఓ సురెందర్ రెడ్డి, ఏపీఓ మధు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పీల్డ్ అసిస్టెంట్ అనిత తదితరులున్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు సొసైటీ కార్యాలయంలో మంగళవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంచేందుకు జీలుగు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బినోల, జన్నెపల్లి, మోకన్ పల్లి గోదాంలలో జీలుగు అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

- ట్రాఫిక్ సిఐ ఓడి రమేష్


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ ఓడి రమేష్

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సిఐ ఓడి రమేష్ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని బస్టాండ్ దగ్గర వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, వాహన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 38 పరీక్ష కేంద్రాలు

- పరీక్ష రాయనున్న 18,288 మంది విద్యార్థులు
- జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి..


హాజరైన అధ్యాపకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

2023 - 24 విద్యా సంవత్సరానికి గాను మే నెల 24 వ తేదీ నుండి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకుజిల్లాలో 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యార్థి అధికారి టి. రవికుమార్ తెలియజేశారు. జిల్లాలో మొత్తం 18,288 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాల, మూడు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, నాలుగు మోడల్ స్కూల్ కళాశాలలు, 14 ప్రైవేట్ కళాశాలలు, ఒక ప్రైవేట్ హై స్కూల్ లను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 11,363 మంది విద్యార్థులకు గాను 10,209 మంది జనరల్ విద్యార్థులు, 1,154 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. రెండోసంవత్సరం విద్యార్థులు మొత్తం 6,925 మంది గాను జనరల్ విద్యార్థులు 5,960 మంది, ఒకేషనల్ 965 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అలాగే సమీపంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష పూర్తయ్యేంతవరకు మూసి వేయడం జరుగుతుందని అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో మెడికల్ సర్వీస్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు సమయానికి అనుకూలంగా బస్సులు నడిపే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారని అన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్‌లలో నిక్షిప్తం చేయడానికి పంపిణీ పూర్తి చేస్తున్నామని తెలిపారు.. గత మార్చి నెలలో నిర్వహించిన పరీక్ష కేంద్రాల్లో ఈసారి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున కొన్ని వాడడం లేదని తెలియజేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు హాల్ టికెట్లలో ముద్రించిన పరీక్షా కేంద్రానికి మాత్రమే వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఆన్లైన్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాలకు హాజరు కావచ్చు అని తెలిపారు. హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని జిల్లా ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రజియుద్దిన్ అస్లాం, దేవరాం సమన్వయం చేస్తున్నారని తెలియజేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసేందుకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, డెక్ బృందాలు కూడా పర్యవేక్షణ చేస్తాయని చెప్పారు. రాష్ట్రస్థాయి ఇంటర్ బోర్డు స్క్వాడ్ బృందాలు కూడా పరీక్షలు నిర్వహణ పర్యవేక్షిస్తాయని తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ చర్యలకు పాల్పడిన కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు . పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి రాతప్రతులు కాని, చీటీలు కానీ తీసుకువెళ్లరాదని తెలిపారు. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు 8:30 గంటల వరకు పరిక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని, ఉదయం 8.30 గంటలకు లోనికి పంపుతారని తెలియజేశారు. రెండవ సంవత్సరం విద్యార్థులు మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాలలో ఫర్నిచర్, మంచినీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు జరుగుతున్నాయని తెలియజేశారు.

దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి

- ఎరువులు, పురుగుల మందులు ఉచితంగా ఇవ్వాలి
- ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి బాబన్న


తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం, సన్నరకం వరి ధాన్యానికి కూడా క్వింటాలకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా నాణ్యమైన ఎరువులు విత్తనాలు ఉచితంగా సప్లై చేయాలని, ఖరీఫ్ సీజన్లో ఏక కాలంగా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి రైతులందరికీ బ్యాంకు వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని అఖిల భారత అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి బాబన్న డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనుము విత్తనాలతో పాటు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు 50శాతం సబ్సిడీతో వ్యవసాయ ఉత్పత్తి సాధనలు, మినీ ట్రాక్టర్ సబ్సిడీతో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.దళిత, గిరిజన, చిన్న సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా పంటల బీమా పథకాన్ని దాని ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) మండల కార్యదర్శి, అధ్యక్షులు ఎం నారాయణ గౌడ్, జిల్లా నాయకుడు మల్కి లింబాద్రి, ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు ఎం సాయరెడ్డి, ఎస్. కిషోర్, బాజన్న గారి సాయిలు, బాజన్న గారి నవీన్, రెడ్డన్న, గ్యామా గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

1977 పిఓటి చట్టం రద్దుచేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

1977 పిఓటి చట్టంను పూర్తిగా రద్దుచేసి పూర్తి హక్కు ం-అనుభవ దారులకు కల్పించాలని ఎంఆర్పిఎస్ అసైన్డ్ భూముల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య, ఎంఆర్పిఎస్ పట్టణ అద్యక్షులు పెద్దిగారి మహేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తాకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1977 పిఓటి చట్టంను పూర్తిగా రద్దుచేసి పూర్తి హక్కు --అనుభవ దారులకు కల్పించాలని కొరారు. మన రాష్ట్రంలో దాదాపు 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, సుమారు కోటిన్నర ప్రజలు ఈ అసైన్డ్ భూములపైననే ఆధారపడి ఉన్నారని అన్నారు. ఈ అసైన్డ్ భూములు అమ్మడం, కొనడం, పేరు మార్పిడి చేయరాదని, లీజుకు ఇవ్వరాదని, ఈ అసైన్డ్ భూములకు పిఓటి చట్టంను పూర్తిగా రద్దుచేసి సమాన హక్కులు కల్పిస్తే పేద ప్రజలు బాగుపడతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నిర్వాహక సభ్యులు ఏ రాములు, ఈ.అనిత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

జీలుగ విత్తనాలు పంపిణీ


జీలుగ పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి నర్సయ్య

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని పిఎసిఎస్ మోతే, వేల్పూరు పడగల్ పరిధిలో సబ్సిడీ పైన జీలుగ విత్తనాలు రైతులకి అందించినట్టు వ్యవసాయ అధికారి నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.30 కిలోల సంచి పూర్తి ధర 2790 కాగా 60శాతం సబ్సిడీ పోను రైతులు రూ.1116 చెలించి తీసుకోవాలని తెలిపారు. 30 కిలోల సంచి రెండున్నర నుండి మూడు ఎకరాలకు వాడుకోవాలని పచ్చి రొట్ట ఎరువులు వాడటం వల్ల నేలలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని, , చౌడు నేలలో పచ్చి రొట్ట వల్ల చౌడు ప్రభావం తగ్గుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం 15-20 శాతం తక్కువ వాడవచ్చు అని తెలిపారు. పొలంలో విత్తనాలు చల్లిన 25-30 రోజుల్లో మొక్క పెరిగి పూత దశకి వస్తుందని, ఆ సమయంలో మొక్కలను రోటవేటర్ తో పొలంలో కలియ దున్నాలన్నారు. జీలుగు వల్ల 2శాతం నత్రజని మొక్కలకు అదనంగా లభిస్తుందని తెలిపారు. జింక్, మాంగనీస్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ సీఈఓ లు రాజేష్, కృష్ణ ,మోహన్, ఏఈఓ షబ్బీర్ రైతులు పాల్గొన్నారు.

సైన్స్, టెక్నాలజీ అభివృద్ధి.. రాజీవ్‌గాంధీ కృషి


నివాళి అర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజీవ్ గాంధీ సైన్స్, టెక్నాలజీ, అనుబంధ పరిశ్రమలకు ప్రభుత్వ మద్దతును పెంచారని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామ్మూర్తి గోపి అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్ నందు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మూర్తి గోపి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవ చేశారని, ప్రధానిగా ఉన్నప్పుడు ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకువచ్చారని తెలిపారు. రాజీవ్ గాంధీ 19 అక్టోబర్ 1990న హైదరాబాద్‌లోని చార్మినార్ నుండి సద్భావన యాత్రను ప్రారంభించారు. గాంధీ సైన్స్, టెక్నాలజీ, అనుబంధ పరిశ్రమలకు ప్రభుత్వ మద్దతును పెంచారని తెలిపారు. టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలు, ముఖ్యంగా కంప్యూటర్లు, ఎయిర్‌లైన్స్, రక్షణ, టెలికమ్యూనికేషన్‌లపై దిగుమతి కోటాలు, పన్నులు, సుంకాలను తగ్గించారని అన్నారు. 1986లో భారతదేశం అంతటా ఉన్నత విద్యా కార్యక్రమాలను ఆధు నీకరించడానికి, విస్తరించడానికి జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించారని తెలిపారు. 1986లో జవహర్ నవోదయ విద్యాలయ వ్యవస్థను స్థాపించారని తెలిపారు. రాజీవ్ గాంధీ వుండి వుంటే రామాలయ నిర్మాణం ఎప్పుడో పూర్తయ్యేదని అన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి రామకృష్ణ, ఈసా, రేవతి, ప్రమోద్, కేశ రాజు, పోల ఉష, విజయ లక్ష్మీ, విజయ రాణి, ముషు పటేల్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎన్నారైలు కృషి చేయాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి


ఎన్నారైలతో ఎమ్మెల్యే..

నవతెలంగాణ-ఆర్మూర్

గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఐలు కృషి చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూ జెర్సీ నగరంలో మంగళవారం ఎన్ఆర్ఐ బీజేపీ నాయకులు ఇతర ఎన్ఆర్ఐలతో సమావేశం అయ్యారు. దేశంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు విదేశాల్లో ఉంటున్న భారతీయుల కోసం మోడి చేస్తున్న పనులు వివరించారు. పుట్టిన ఊరు రుణం తీర్చుకోవాలని, నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ఆర్ఐ లు ముందుకు రావాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగేలా ఆలోచనలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తోడ్పాటు అందేలా చూస్తామని అని రాకేష్ రెడ్డి తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించాలి

- జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ అధికారులు చాక చక్యంగా వ్యవహరిస్తూ పరీక్షలను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ ఆదేశించారు. ఈ నెల 24 నుండి నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల సన్నాహక సమావేశం మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటర్ విద్య అధికారి టి. రవికుమార్ మాట్లాడుతూ.. చీఫ్ సూపరింటెం డెంట్లు, డిపార్మెంటల్ అధికారులు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కచ్చితంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, మంచినీటి వసతి కల్పించడంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు పని చేసే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ,సాంఘిక సంక్షేమ, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాల సమీపంలోని పోలీస్ స్టేషన్ లో కస్టోడియన్ కేంద్రాలలో ప్రశ్నాపత్రాల బెండలను ముందే పరిశీలించి సమాచారం అందజేయాలని ఆదేశించారు. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహించబడతాయని తెలియజేశారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్లైన్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని రావచ్చని తెలియజేశారు. హాల్ టికెట్ పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్ష కేంద్రానికి అనుమతించాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు ఆశా వర్కర్ల ద్వారా మెడికల్ సర్వీస్ ఏర్పాటు చేయించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి 144 సెక్షన్ అమలు కోసం సమీప పోలీస్ స్టేషన్, ఎంఆర్ఓ కార్యాలయాలలో చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు సంప్రదించాలని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఉదయం నిర్వహించిన పరీక్ష జవాబు పత్రాలను, మధ్యాహ్నం నిర్వహించిన రెండవ సంవత్సరం జవాబు పత్రాల బండిలను సమీప పోలీస్ స్టేషన్లలో భద్రపరిచి పోస్ట్ ఆఫీస్‌లలో నిక్షిప్తం చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు దొర్లకొండ చూడాలని, ఎలాంటి అనుమానాలు సమస్యలు తలెత్తిన వెంటనే జిల్లా కేంద్రంలోని ఇంటర్ పరీక్షల నిర్వహణ కేంద్రంలో రిపోర్టు చేయాలని తెలియజేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. పరీక్షల నిర్వహణను సమీక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, రాష్ట్రస్థాయి స్క్వాడ్ బృందాలు నియమించినట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టల్ శాఖ, ఆరోగ్యశాఖ, ఆర్టీసీ ఆర్టీసీ అధికారులు, పోలీసు విభాగం తదితర ఉన్నతాధికారుల సమన్వయ సమావేశంలో పరీక్షల నిర్వహణకు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారని ఇంటర్ విద్య అధికారి తెలిపారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రజియుద్దిన్ అస్లాం, దేవరాం మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్మెంటల్ అధికారులు తమ విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎండాకాలమయి నప్పటికీ వర్షాలు పడుతున్నందున జవాబు పత్రాల బండిళ్లను ప్లాస్టిక్ కవర్లలో కట్టి పోస్ట్ చేయాలని తెలియజేశారు. వేసవికాలం దృశ్య పరీక్షలు రాసే విద్యార్థులకు సౌకర్యాలలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ.. సప్లమెంటరీ పరీక్షల నిర్వహణలో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు విధి నిర్వహణలో పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ లెక్చరర్ సంఘం నాయకులు నర్సయ్య, బండారి భాస్కర్, లక్ష్మీనారాయణ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్ల మాట్లాడారు.

మహతి ఆశ్రమానికి విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పట్వారీ గోపికృష్ణ అధ్యక్షతన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విక్రం సింహా రావు మహతీ ఆశ్రమానికి విద్యార్థుల అవసర నిమిత్తం 3000 రూపాయలు విరాళంగా ఆశ్రమ ఇన్చార్జి నరేష్ కుమార్‌కు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా విక్రమ్ సింహారావు మాట్లాడుతూ... సమాజంలో ఇలాంటి నిరాశ్రయ విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని, మనం చేసే కొంత సహాయమైనా విద్యార్థుల భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవడానికి సహాయపడుతుందని అన్నారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని, ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, పట్వారీ బాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది 'పది'


విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు పదవ తరగతి నుండి పునాది పడుతుందని, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిమ కనబరిచిన విద్యార్థులకు భవిష్యత్తులో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ అన్నారు. ఎస్ఎస్ యుఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ ఆధ్వర్యంలో భీమ్‌గల్ పట్టణంలోని బోయ గల్లీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 10/10 సాధించిన కొఠారి అపూర్వతోపాటు మిగిలిన విద్యార్థులకు ఎంఈఓ స్వామి, ఉపాధ్యాయులు లింబాద్రి, రాములు వినోద్ సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ ఉన్నత విద్యకు మార్గం పదో తరగతి ఫలితాలని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచి భీమ్‌గల్ ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరును తీసుకువచ్చిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ఉత్తమ ఫలితాలు రాబట్టిన ఉపాధ్యాయు లను అభినందించారు. భవిష్యత్తులో ఇదేవిధంగా కృషిచేసి ప్రభుత్వ పాఠశాలను రాష్ట్రస్థాయిలో ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దాలని, విద్యార్థులు కూడా క్రమశిక్షణతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని విలువలతో కూడిన విద్యను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి మొండి దినేష్, మండల ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు గౌరు ప్రశాంత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు సుధీర్, వినయ్, పవన్, శ్రీకాంత్, నితిన్, రిషి, రాము, రిశ్వంత్, హైమద్ పాల్గొన్నారు.

మొరం టిప్పర్ల అతివేగం

- ఇబ్బంది పడుతున్న స్థానికులు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రం నుండి నిజామాబాద్‌కి వెళ్లేదారిలో మొరం ట్రిప్పర్లు అతివేగంతో వెళ్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలను సైతం లెక్కచేయకుండా మితిమీరిన వేగంతో వెళ్లడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తానాకుర్ది సమీపాన వేగం మాత్రం అదుపు దాటుతుంది. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం కానీ రెవెన్యూ యంత్రం కానీ వాటిపైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శ్రీ స్వయంభు శివలింగం వార్షికోత్సవం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోలిలింగాల గ్రామంలో నిర్మించిన శ్రీ స్వయంభు శివలింగం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ మాధవనంద సరస్వతి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. స్వయంభు శివలింగం మొదటి వార్షికోత్సవం నిర్వహించినందున ఈ ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దిగంబర పంతులు, మాజీ సర్పంచ్ శివకుమార్‌తో పాటు గ్రామపెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న దృశ్యం

ఉపాధిహామీ పనులపై అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కోమటిపల్లి గ్రామంలో సెంట్రల్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో భాగంగా ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశం దగ్గరికి వెళ్లి అవగాహన నిర్వహించారు. అనంతరం గ్రామంలో గల రైతులు, ఉపాధి కూలీలు అందరూ 100 రోజుల పనిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. వారానికి ప్రతి సారి డిమాండ్ పేపర్ ఇవ్వాలని, పూర్తిగా వేతనం పొందేలా పని చేయాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధులు రాజు తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న పలువురు

దాహం తీర్చని భగీరథ

బిచ్కుంద మండలంలో మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులు

- సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం
- ఫిర్యాదు చేస్తే మరమ్మతుల సాకుతో పొంతనలేని సమాధానం
- డబ్బులు పెట్టి నీరు కొనుక్కుంటున్న ప్రజలు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రతి ఇంటికి మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. దీనికోసం వేల కోట్ల రూపాయలను వెచ్చించింది. ప్రజల దాహార్తి తీర్చడం కోసం సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాంతో ప్రజలకు తాగునీరు అందకుండా పోతున్నది. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన అధికారులు క్షేత్ర స్థాయిలో అధికారుల అలసత్వంతో తాగునీరు అందకపోవడంతో ప్రజలు ప్రయివేటు వాటర్‌ప్లాంట్ల నుంచి డబ్బులు పెట్టి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

బిచ్కుంద మండల కేంద్రంలో ప్రజల దాహార్తి తీర్చడానికి భద్రాల్ తండాలో ఒక లక్ష ఇరవై వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, ప్రేమ్‌నగర్‌లో 60 వేల లీటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒక లక్ష 20 వేల లీటర్లు, నూతన బస్టాండ్ వద్ద 40 వేల లీటర్లు, సొసైటీ వద్ద 40 వేల లీటర్లు, గుల్లగుట్ట వద్ద ఒక లక్ష ఇరవై వేల లీటర్లు, స్మశానవాటిక వద్ద ఉన్న ట్యాంక్ సామర్థ్యం ఒక్క లక్ష ఇరవై వేల లీటర్లు, కమ్మరి గుడి వద్ద 90 వేల లీటర్లు, కోర్టు సమీపాన గల 40 వేల లీటర్లు, గిద్దె చెరువు వద్ద 40 వేల లీటర్లు, మఠం వద్ద ఒక్క లక్ష ఇరవై వేల లీటర్ల సామర్థ్యం ట్యాంకులను ఉదయం, సాయంత్రం మిషన్ భగీరథ అధికారులు నింపాలసి ఉండగా గత నెల రోజుల నుంచి కొద్దిపాటి నీళ్లు నింపి ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలకు తాగునీరు అందించడంలో వారి నిర్లక్ష్యం కనిపిస్తోంది. వేసవికాలం ఉండడంతో ప్రజలకు దాహార్తి తీర్చాల్సిన మిషన్ భగీరథ అధికారులు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని నీటి ట్యాంకులు నింపి రెండు పూటల తాగునీరు అందిస్తున్నామని తప్పుడు లెక్కలు చూపిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల దాహార్తిని తీర్చడంలో విఫలమవుతున్నారు. ప్రజలు తాగునీటి కోసం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు మరమ్మతుల సాకుతో పొంతనలేని కారణాలతో ప్రజలకు సమాధానాలు చెప్తున్నారు. దీంతో ప్రజలు తాగునీటి కోసం స్థానిక ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించి డబ్బులు పెట్టి తాగునీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరైతే వాటర్ ప్లాంట్ల నుంచి తీసుకొచ్చిన తాగునీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని బహిరంగంగానే చెప్తున్నారు. అధికారులు మిషన్ భగీరథ ద్వారా అందజేస్తున్న స్వచ్ఛమైన తాగునీరు మాత్రమే తాగండి ఆరోగ్యంగా ఉండండి అని ప్రచారం చేస్తున్నప్పటికీ తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు స్పందించి మిషన్ భగీరథ ద్వారా రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలతో పాటు మండలంలోని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న నీటి ట్యాంకు

అనారోగ్యానికి గురవుతున్నాం



గత నెల రోజుల నుంచి తాగునీరు రావడం లేదు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల నుంచి నీళ్లు కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాటర్ ప్లాంట్‌ల నీరు తాగడం వలన అనారోగ్యానికి గురవుతున్నాం.

- నారంశంకర్ (మఠంగల్లి బిచ్కుంద)

పంచాయతీల అభివృద్ధికి సెక్రెటరీలు కృషి చేయాలి

- పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీల అభివృద్ధికి సెక్రెటరీలు కృషి చేయాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, రాంపూర్ కలాన్, కిష్టాపూర్ గ్రామపంచాయతీలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పంచాయతీలలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను, కంపోస్టు షెడ్, క్రిమిటోరియం, నర్సరీ, పల్లె ప్రకృతి వనం నిర్వహణ పనులు ఎలా ఉన్నాయని సెక్రటరీలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, మండల పంచాయతీ అధికారి బ్రహ్మం, పిపీఓ శివ కుమార్, సంబంధిత పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన

- సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు



సమస్యలను తెలుసుకుంటున్న అధికారి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని 18 అమ్మ ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడానికి జిల్లా మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించినందున ప్రధానోపాధ్యాయులు ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు సంయుక్తంగా ఖాతా బుక్కు తెరవాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రధానంగా విద్యుత్ సౌకర్యం, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్మాణాలు, తదితర సమస్యలను వారు పరిశీలించారు. మండలంలోని సాటాపూర్, నీలా, పేపర్‌మిల్, కందకుర్తి, బోర్గం, తాడ్‌బిలోలి గ్రామాలలోని పాఠశాలలను సందర్శించి సమస్యలను నివేదికను తయారు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ రాజయ్య, ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, పంచాయతీరాజ్ వినయ్‌కుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మందులు, విత్తనాలను అరికట్టాలి

- అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

రాబోవు ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకొని కల్తీ మందులు, విత్తనాలను ప్రభుత్వం అరికట్టాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంచార్జి తహసీల్దార్ శ్రావణ్ కుమారుకు వినతిపత్రం అందజేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయాలని, కొత్తగా ప్రకటించిన పింఛన్ రూ.4016ను వెంటనే అమలు చేయాలని, కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరికీ నూతన కార్డులను మంజూరు చేయాలని, రైతులకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ సంఘం జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, కార్మిక సంఘం జిల్లా నాయకులు పార్వతి రాజేశ్వర్, అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం మండల అధ్యక్షులు వడ్డెన్న, కార్యదర్శి ఎస్కె నసీర్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షులు మిద్దె పెద్దులు, నాయకులు గోపాల్, సిద్ధ పోశెట్టి, తరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ టు కందర్‌పల్లి..

- అక్రమంగా మొరం తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలంలో మొరం దందా అధికారుల అండదండలతో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అధికారుల అండదండలు ఉండటంతో అక్రమార్కులు మరింతగా రెచ్చిపోయి మొరాన్ని తరలిస్తున్నారు.

జుక్కల్ మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ అసైన్‌మెంట్ ల్యాండ్ నుంచి తవ్వకాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. బిచ్కుంద మండలంలోని కందర్‌పల్లి గ్రామంలోని ప్రయివేట్ పాఠశాల నిర్మాణానికి, ప్రయివేట్ వ్యక్తుల ప్లాట్లకు తరలిస్తున్నారు. మారుమూల ప్రాంతం కావడంతో ఏం చేసినా ఎవరూ అడిగే వారు లేరన్న ధీమాతో మొరం మాఫియా అధికారులతో తెరవెనుక ఒప్పందాలు చేసుకుని మొరాన్ని తరలిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పా రెవెన్యూ అధికారులు కుర్చీల నుంచి ఫీల్డ్‌లోకి వెళ్దామనే ధ్యాస వారికి కలగడం లేదు.

జుక్కల్ మండల తహసీల్దార్ జుక్కల్ మండలానికి వచ్చిన నాటి నుంచి గ్రామాల సందర్శన, ప్రజల సమస్యలు తెలుసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా అధికారులను ప్రశ్నిస్తే ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే ప్రభుత్వం కల్పించిన సెలవులను కూడా కుటుంబంతో గడపేందుకు సమయం ఇవ్వరా..? అని చీదరించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఊకదంపుడు మాటలు తప్పా.. చర్యలేవి?..

అధికారుల తీరు చూస్తుంటే వారికి అన్నీ తెలిసిన ఏమీ ఎరుగనట్టు వ్యవహరించిడం పరిపాటిగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. తాత్కాలిక చర్యలు తప్పా పర్మినెంట్ చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

'మండలంలో మొరం వేరే మండలానికి తరలిస్తున్న వాటిని నిలిపివేశాం.' అని ఎమ్మార్వో హిమబిందు తెలిపారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని నవతెలంగాణ ప్రశ్నించగా.. 'మైన్స్ వారే అనుమతి ఇవ్వాలి. నేను వారికి ఓవరల్‌గా తెలియజేశాను తప్పా తనకేమీ తెలియదు.' అని తెలిపారు.



కుప్పలుగా పోసిన మొరం



నిరసనలో పాల్గొన్న నాయకులు

వ్యవసాయ రంగానికి సబ్సిడీలను రద్దుచేయడం సరికాదు

నవతెలంగాణ-బోధన్

వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలను రద్దు చేయడం సరికాదని అది సిగ్గుచేటని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం బోధన్ ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి సుల్తాన్ స్థాయిలు అన్నారు. మంగళవారం సాలురా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టించి పంట పండించే వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు రద్దు చేసి బడా కార్పోరేట్లకు రాయితీలు ఇవ్వడం సిగ్గు చేటని అన్నారు. నేడు ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించడానికి రైతాంగం సమాయాత్తం అవుతున్న సమయంలో రైతాంగానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను, మినీ ట్రాక్టర్లను 50 శాతం సబ్సిడీపైన ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. దేశంలో దశాబ్దాల నుంచి రైతాంగానికి సబ్సిడీలపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను ఇస్తూంటే, నేటి పాలకులు వాటిని రద్దు చేసి, బడా కార్పోరేట్లకు పెద్ద మొత్తంలో రాయితీలను కల్పించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇది దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రేనని అన్నారు. ఇప్పటికైనా అటువంటి చర్యలను మాని పేద, దళిత, గిరిజన, చిన్న, సన్నకారు రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు యంత్ర పరికరాలను ఉచితంగా ఇచ్చి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతాంగానికి 10వేల చొప్పున నష్టపరిహారం ఇస్తానని ఇప్పటికీ ఇవ్వలేదని, ఎకరానికి 25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల ఫసల్ బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పంటలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సి.హెచ్.గంగారాం, లచ్చారాం, లక్ష్మీబాయి, రాజన్న, సరస్వతి, లక్ష్మీ, గంగయ్య, లక్ష్మణ్, ఎం.రాజన్న, సంజీవ్, దత్తు, సాయిలు, యు.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మెమోలు జారీకి చర్యలు

- 'అంతా మా ఇష్టం' కథనానికి స్పందన..

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుండా, విధులలో నిర్లక్ష్యం వహించడంతో 'అంతా మా ఇష్టం' అనే శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా వైద్యాధికారి వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అలాగే బోధన్ డివిజన్ ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నవతెలంగాణ కథనంపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది ఎవరు సమయపాలన పాటించడం లేదు?, ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు? అంటూ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. విధులలో నిర్లక్ష్యం వహించిన, సమయపాలన పాటించని వారికి మెమోలు జారీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.



జూన్ మొదటి వారంలోపు నర్సరీలలో మొక్కలు సిద్ధం కావాలి

- డిఆర్‌డివో చందర్ నాయక్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిఆర్‌డివో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

జూన్ మొదటి వారంలోపు నర్సరీలలో మొక్కలు అన్ని సిద్ధం కావాలని డిఆర్‌డిఓ చందర్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని వదలపర్తి, మాల్‌తుమ్మెద గ్రామాలలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పదివేల మొక్కలను సిద్ధం చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఉపాధి హామీ పనిలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనం రూ.300 పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతిరోజు ఉపాధి హామీ పనుల వద్ద పర్యవేక్షణ తప్పనిసరిగా చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో పర్బన్న, ఏపీవో సాయిలున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సార్ విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలు అందజేత



పలువురికి మెమొంటో అందజేసి సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్ విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులకు శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. బోధన్ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు చెందిన ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసినట్లు డివిజన్ అధ్యక్షులు సిరిగాద పరమేశ్వర్ ఆచార్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.సాయికుమార్ హాజరై మాట్లాడుతూ.. పురస్కారాలు అందుకున్న విద్యార్థులందరూ చక్కని ప్రతిభ కనపరచి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలంటే కష్టపడి చదవడమే ఏకైక మార్గమని సూచించారు. వివా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుకల లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు అంబిషన్, ఆటిట్యూడ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, పాజిటివ్ థింకింగ్ అనే నాలుగు అంశాలపై దృష్టిపెట్టి ఫలితాలను ఆశించకుండా కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థితిలో ఉంటూ సమాజ సేవలో పాలుపంచుకునే అవకాశం దక్కుతుందన్నారు. వేవా జిల్లా అధ్యక్షులు రాఘవపురం గోపాలకృష్ణ ఆచార్య మాట్లాడుతూ.. ప్రపంచంలో చదువుకు సాటి మరేదీ రాదని జ్ఞానం సంపాదించుకుంటే మంచి వ్యక్తిత్వంతో సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకొంటూ ముందుకెళ్లవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివా రాష్ట్ర సలహాదారులు అమరవాజి కిరణ్ కుమార్, గౌరవ అధ్యక్షులు మురహరి, కోశాధికారి వేణు, శ్రీనివాస్, సాయేందర్, రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్, లక్ష్మీనారాయణ, శివాజీ, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు జనార్ధన్, నాగరాజు, గంగాధర్, రాందాస్, కాళిదాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు తనిఖీ

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని చింరాజ్ పల్లి గ్రామంలో కంపోస్టు షెడ్డు, పల్లె ప్రకృతి వనం, జీపీ రికార్డులను డిఎల్‌పివో శివ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఆయన గ్రామానికి వచ్చి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట యంపిఓ కిరణ్ కుమార్ కార్యదర్శులు ప్రశాంత్, సాయి ఉన్నారు.



పల్లెప్రకృతివనం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

రోడ్డుపై మురుగనీరు

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని 9వ వార్డులో శివ గల్లికి వెళ్లే రోడ్డుపై మురికి నీరు నిలువ ఉండడంతో ఆ కాలనీ వాసులు అటుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ వెళ్లేందుకు ఆ కాలనీవాసులకు ప్రధాన మార్గం కావడం వల్ల ప్రతినిత్యం ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రజలు ఆ మురికి నీటి నుండే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కనుక మున్సిపల్ సిబ్బంది స్పందించి రోడ్డుపై మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.



టిఎస్ఆర్టిసి డిపోలో బస్ భవన్ కార్యక్రమం



చలో బస్‌భవన్‌లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో బస్ భవన్ కార్యక్రమం మంగళవారం టి ఎస్ ఆర్ టి స డిపోలో నిర్వహించారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు రవి చందర్, రమేష్, రాష్ట్ర కార్యదర్శి గోపి, అధ్యక్ష కార్యదర్శులు రవి చందర్, రమేష్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియని వెంటనే పూర్తి చేయాలన్నారు. చట్టపకారం టీఎస్ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుదించాలని, 2013 ఆర్పీఎస్ బాండ్ డబ్బులను వెంటనే అందరికీ చెల్లించాలి అని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలీ అని, అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగవ్వ సుజాత, సుమలత, జ్యోతి, లత, భూమన్న, శీను, హరి, రవీందర్, గంగాధర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి కల్యాణోత్సవం



అన్నదానంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని సరస్వతి ఆలయంలో సరస్వతి దేవి కల్యాణోత్సవం గ్రామ కమిటి అధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞం, అభిషేకం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

చిక్లి గ్రామంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి కల్యాణోత్సవం

మండలంలోని చిక్లి గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో గ్రామ కమిటీ, ఆలయ కమిటీ అధ్వర్యంలో నరసింహ స్వామి కల్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, పల్లకి సేవ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అజార్ మహేష్, చైర్మన్ దేవేందర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శేఖర్, ముత్యన్న, గ్రామస్తులు గంగాధర్, సతీష్, పెద్ద సాయిలు, శ్రీధర్, రాజు, భోజన్న, భూమన్న తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం




కళ్యాణంలో పాల్గొన్న జంటలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, ఉపాధ్యక్షులు శివసారం గణేష్, కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి జైడి బాలకృష్ణ, సలహాదారులు కండక్టర్ రవీందర్, దూలూరి కిషన్ గౌడ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా అధికారి



నవతెలంగాణ-మోర్తాడ్

మండలం తిమ్మాపూర్‌లో నిర్వహిస్తున్న బాల్ బ్యాట్ మెన్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారి ముత్తన్న మంగళవారం సందర్శించారు. జిల్లా యువజన కీడాభివృద్ధి అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న బాల్ బ్యాట్మెన్ వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. ఈ శిబిరంలో యువత ఎలా పాల్గొంటుందనే దానిపై జిల్లా అధికారి పాల్గొని విద్యార్థుల ఆటలను పరిశీలించారు. క్రీడల్లో పాటించాల్సిన పలు విషయాలను విద్యార్థులకు సూచిస్తూ జాతీయస్థాయిలో రాణించే విధంగా పలు సూచనలు అందించారు. పలువురు విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యామ్ సందీప్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు అందించాలి

- ఏకకాలంలో రుణమాఫీ చేయాలి
- కొత్తరుణాలు అందించాలి
- ఏఐపీకేఎస్
- ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

వ్యవసాయ రంగాన్ని కాపాడడానికి వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు, విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ, కొత్తరుణాలు తదితర డిమాండ్లపై అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సారా సురేష్, ఏరియా అధ్యక్షులు గంగారాములు మాట్లాడుతూ.. 2014 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేసిన రైతులకు రెండింతల ఆదాయం తెచ్చి పెడతానని ఎన్నికల ప్రణాళికలో చెప్పి మోడీ సర్కారు మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటు వ్యాపారుల దోస్తీ పెరగడంతో వ్యవసాయ రంగాన్ని బొంద పెట్టడానికి అప్పటికే ఉన్న సబ్సిడీలు అన్నిటిని రద్దు చేయడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే దేశవ్యాప్తంగా రైతులను కాపాడడానికి క్షేత్రస్థాయిలో పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ఇస్తూ వ్యవసాయ రంగం కాపాడాలని కోరారు. రైతులకు అన్ని రకాల అప్పులను రద్దు చేయడానికి మోడీకి ధైర్యం కాదు కానీ కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు రద్దుచేసి ఆనందాన్ని పొందుతున్నాడని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఏరియా ప్రధాన కార్యదర్శి యు రాజన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడీ రద్దుచేసి రైతులపై భారం పెంచే విధంగా వివరించిందని.. ఈ ప్రాంతంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందని బిజెపి గుర్తు చేశారు.. మరోవైపు కేంద్రం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సైతం దాంతో గొంతు కలిపి సర్వరోగ నివారిణి రైతుబంధుని తెలంగాణ ప్రభుత్వం 2014 తర్వాత చూయించడం సబబు కాదని అన్నారు.. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ ఏకకాలంలో ఏనాడు చేయలేదని వడ్డీలు మాత్రమే కొంత మాఫీ అయిందని అసలు ఆ విధంగానే మిగిలి నూతన పూలు రాక రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులు ఆశ్రయించి అప్పులు తీరే మార్గం లేక రైతు ఆత్మహత్యలు పెరిగాయని అన్నారు.. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని పంటలకు 500 బోనస్ ను ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని అన్నారు... ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు ఇస్తారి రమేష్.. %u% .గంగాధర్. జిల్లా నాయకులు బి. మల్లన్న. అశోక్. లింబాద్రి.. శోభన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో పలు కోర్సులకు అనుమతి

నవతెలంగాణ ఆర్మూర్

మండలంలోని చేపూర్ క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్(బీబీఏ) బిటెక్ సిఎస్ డేటా సైన్స్ కోర్సులకు ఏఐఓ టీఈ నుండి అనుమతి లభించినట్టు త్వరలో కౌన్సిలింగ్ సైతం నిర్వహిస్తున్నట్టు కళాశాల యాజమాన్యం మంగళవారం తెలిపారు. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆర్మూర్ నందు నూతనంగా ఈ సంవత్సరం నుండి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) మరియు బిటెక్ సీఎస్-డేటా సైన్స్ కోర్సులకు అఖిల భారతీయ సాంకేతిక విద్యా మండలి న్యూ ఢిల్లీ నుండి అనుమతి లభించిందని తెలిపారు. ఇట్టి కోర్సు పరిమిత కాలేజీలో మాత్రమే అనుమతి లభించడం అందులో క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కి అనుమతి రావడం గొప్ప విషయమని తెలిపారు.. నిజామాబాద్ స్థానిక విద్యార్థులతో పాటు నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి, విద్యార్థులు బిబిఏ బిటెక్ సీఎడేటా సైన్సెస్ కోర్సుల్లో చేరి మంచి ఉపాధి అవకాశాలని పొందాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న కబడ్డీ క్యాంపు



నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామీణ క్రీడా ప్రాంగణం 'చైతన్య నెహ్రూ యువజన సంఘం' క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కబడ్డీ సబ్ జూనియర్ 'అండర్-16, జూనియర్ విభాగం అండర్-20, బాలుర కబడ్డీ శిక్షణ తరగతులు 'సమ్మర్ స్పెషల్ క్యాంపు' కొనసాగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఎస్సై గా విధులు నిర్వర్తిస్తున్న ప్రదీప్ క్రీడాకారులకు శిక్షణలో మెళుకువలు నేర్పించారు. శిక్షణ తరగతుల్లో క్రీడాకారులు ఉత్సహంగా పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పీడీ రాజ్ కుమార్, పీఈటీలు,రిటైర్డ్ ఉపాధ్యాయులు, యువజన సంఘం నాయకులు, కబడ్డీ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సెర్చ్ కమిటీల పేర కాలయాపన సరికాదు

పీడీఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీల పేర కాలయపన చేయటం సరైంది కాదని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ తెలిపారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ నియమాకాలకు సెర్చ్ కమిటీలను నియమించారని, కానీ వీసి ల పదవీకాలం ముగిసిన మళ్ళీ ఇంచార్జీ వీసి లను నియమించటం అంటే యూనివర్సిటి ల అభివద్ధిని అడ్డుకోవటమేనని పేర్కొన్నారు. కాలయాపన చేయడం వల్ల వైస్ ఛాన్సలర్ల నియామకాలు హేతుబద్ధంగా జరిగే అవకాశాలు లేవని, రెగ్యులర్ వీసి నియమాకాలు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ- నవీపేట్

ఉపాధి హామీ కూలీలకు పనిముట్లతోపాటు నీరు, నీడ సౌకర్యాలను కల్పించాలని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎంపీడీవో నాగనాథ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో తీవ్రమైన ఎండలు ఉన్న కానీ నీరు, నీడ కల్పించకపోవడంతో వడదెబ్బ, గుండెపోటుతో ఉపాధి కూలీలు మృతి చెందుతున్నారని అన్నారు. అలాగే గత పది సంవత్సరాలుగా పారా, పలుగులు కూలీలకు అందజేయలేదని, వెంటనే అందజేయాలని కోరారు. దీనికి ఎంపీడీవో సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమ్ రావు, అబ్బన్న, సునీల్, లక్ష్మణ్, రాజశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు తయారు చేయాలి

- ఎంపిడిఓ రవీందర్



కంపోస్టు షెడ్‌లో నట్టలను వేస్తున్న అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామాల్లోని కంపోస్ట్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేసే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీందర్ అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కంపోస్ట్ షెడ్‌లో నట్టలను వదిలారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావుతో కలిసి మాట్లాడారు. గ్రామంలో సేకరించిన చెత్తనుండి తడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. ఎరువులు తయారైన తర్వాత చెట్లకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ రకంగా గ్రామ పంచాయతీలు సేంద్రియ ఎరువులను తయారు చేసే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ రాము, సంతోష్, శ్యాం సన్, ప్రమోద్, రాజేందర్, అశోక్, తదితరులు ఉన్నారు.

క్రీడల్లోనూ ఆసక్తి చూపాలి



షీల్డులు అందుకున్న క్రీడాకారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా ఆడమగ తేడా లేకుండా ఆసక్తి చూపాలని నిశిత డిగ్రీ కళాశాల విద్యార్థులతో శ్రీజె శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ సంఘ అధ్యక్షులు జగరమోహన్ రావు మంగళశారం నిశిత ఇంటర్నేషనల్ స్కూల్ ను సందర్శించి ప్లే గ్రౌండు పరిశీలించారు. వారితోపాటు దేవరాజు, సెక్రెటరి హెచ్ సిఎ, శ్రీజేశ్రీనివాస్, హెచ్సిఎ కోశాధికారి నిశిత డిగ్రీ కళాశాల విద్యార్థులతో శ్రీజె శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడలకు 51 శాతం, విద్యకు 44 శాతం ప్రాముఖ్యత ఉంటుందని వివరించారు. ఎ. జగన్ మోహన్ రావు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభను చూపేవారే కాకుండా, ఓడిన క్రీడాకారులు కూడా జీవితంలో ఎలా ముందుక వెళ్ళాలో నేర్చుకుంటారని అంటారు. క్రీడలు పిల్లలకు మానసికంగా, శారీరకంగా, వ్యక్తిగతంగా సమాజంలో ఎదగడానికి తోడ్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి నిశిత డిగ్రీ కళాశాల చైర్మన్ నిఖిల్, కో-ఆర్డినేటర్ రాజు, డైరెక్టర్ డాక్టర్ ఓఎం షేక్గారు. ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న, నిశిత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమీందర్ కౌర్ మోది, స్పోర్ట్స్ ఇన్చార్జి కృష్ణప్రసాద్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జిల్లాలో 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ.శరత్
- ఇందల్వాయి కొనుగోలు కేంద్రం తనిఖీ
- చివరి ధాన్యం గింజను సైతం కొనుగోలు చేస్తామని స్పష్టీకరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శరత్

ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిజామాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేయడం జరిగిందని నిజామాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ ఏ.శరత్ వెల్లడించారు. ఇంకనూ రైతుల వద్ద నుండి చివరి ధాన్యం గింజను సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు అవసరమైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచుతూ, సంబంధిత అధికారులను సమాయత్తంగా ఉంచామని అన్నారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ తో కలిసి ఇందల్వాయి లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులను పలుకరించి, ధాన్యం సేకరణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు, రైతులకు ఏ మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయని అధికారులను ఆరా తీశారు. ఇందల్వాయి కేంద్రం ద్వారా 8691 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 8459 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం ట్యాబ్ ఎంట్రీ పూర్తయ్యిందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. మిగతా కొనుగోళ్లకు సంబంధించి కూడా వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి శరత్ ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీ సకాలంలో పూర్తయితేనే, రైతులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. కాగా, కొనుగోలు కేంద్రానికి కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం తెచ్చిన ఓ రైతు ప్రత్యేకాధికారిని కలిసి మూడు రోజుల నుండి తన ధాన్యాన్ని తూకం వేయడం లేదని ఫిర్యాదు చేయడంతో కేంద్రం నిర్వాహకులపై స్పెషల్ ఆఫీసర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు రైతు ధాన్యాన్ని సేకరించి సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మిగతా రైతుల ధాన్యం సేకరణలోనూ జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. ఏ ఒక్క రైతు ఇబ్బందికి గురి కాకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని హితవు పలికారు.

జిల్లాలో ఇంకనూ సుమారు 5500 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వలు వచ్చే అవకాశాలు ఉన్నందున, ప్రస్తుతం కొనసాగుతున్న 25 కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి శరత్ ఆయా కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతాలైన పడిగెల్, డొంకేశ్వర్ వంటి చోట్ల వరి నాట్లు వేయడంలో ఆలస్యమైనందున ధాన్యం దిగుబడులు కొంత ఆలస్యంగా వస్తున్నాయని అన్నారు. అలాంటి ప్రాంతాలను మినహాయిస్తూ, మిగితా చోట్ల రెండుమూడు రోజుల్లో ధాన్యం సేకరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చొరవ చూపాలని అధికారులకు సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తహసీల్దార్, ఏ.ఓ, సొసైటీ కార్యదర్శితో పాటు సెంటర్ ఇంచార్జ్ లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, క్షేత స్థాయిలో తాము కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. వీరి వెంట డీఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్ తదితరులు ఉన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం విరాళాలు అందజేత



విరాళం అందజేస్తున్న గ్రామకమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో గ్రామకమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన శివాజీ విగ్రహ నిర్మాణం కోసం ఏర్గట్ల గ్రామకమిటీ వారు 11 వేల 116 రూపాయలు, గ్రామానికి చెందిన బర్మ నిఖిల్ 20 వేల రూపాయలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షులు కారుపాకల నర్సయ్య, ఉపాధ్యక్షులు బంటు ప్రశాంత్, కోశాధికారి సోమ లింగారెడ్డి, గ్రామకమిటీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధ రామేశ్వర ఆలయంలో వాస్తు నివారణ పూజ

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో మంగళవారం హైకోర్టు సీనియర్ న్యాయవాది రాంరెడ్డి ఆధ్వర్యంలో వాస్తు నివారణ పూజా కార్యక్రమాన్ని మొదటి రోజు నాలుగు వేదాల పారాయణం నిర్వహించారు. లోక కళ్యాణార్థం వాస్తు నివారణ పూజ చేస్తున్నట్టు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, న్యాయవాది రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, భక్తులు, పూజారులు, పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

రిజిస్టర్లను తప్పకుండా రాయాలి

- ఎంపీవో మహబూబ్

నవతెలంగాణ-బిచ్కుంద

నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం రిజిస్టర్లను తప్పకుండా రాయాలని మండల పంచాయతీ అధికారి మహబూబ్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని హస్గుల్ గ్రామంలో ఉపాధి హామీ ద్వారా కూలీలు చేపడుతున్న కెనాల్ ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో వడదెబ్బ తాకకుండా అనారోగ్యానికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. పల్లె ప్రకృతివనం నందు పిచ్చి మొక్కలు తొలగించాలని వైకుంఠధామానికి కరెంటు కనెక్షన్, నీటి వసతిని పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

పల్లెల్లో పంచాయతీ సందడి

- పోటీ చేసేందుకు యువకులు ఆసక్తి
- గెలుపు గుర్రాల కోసం ప్రధాన పార్టీల అన్వేషణ
- పోటీ చేసేందుకు తాజా మాజీల ఆసక్తి

నవతెలంగాణ-లింగంపేట్



జూన్ నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారులు కసరత్తు మొదలు పెట్టడంతో పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. పోటీ చేసేందుకు ముఖ్యంగా యువకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రధాన పార్టీలు పంచాయతీ ఎన్నికల్లో తమ అనుచరులను బరిలోనికి దించేందుకు గెలుపు గుర్రాల కోసం పార్టీ నాయకుల అన్వేషణ మొదలుపెట్టారు. మరోవైపు తాజా మాజీలు సైతం పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏదేమైనప్పటికీ జూన్ మాసం సమీపిస్తుండడంతో రాష్ట్రానికి అధికారులు పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు మొదలు పెట్టడంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది.

జనవరి మాసంలో సర్పంచుల పదవీ కాలం ముగిసిపోయింది. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. కామారెడ్డి జిల్లాలో 526 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. జూన్ 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రానున్నాయి. దీంతో ఎన్నికల కోడ్ పూర్తవుతుంది. గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల హడావుడి మొదలైంది. ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూలు రావొచ్చని చర్చలు జోరందుకోవడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయోనని ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. దీంతో పోటీ చేసే యువకులు తాజా మాజీలు గ్రామంలోనే ఉంటూ యువజన, కుల సంఘాలతో మంతనాలు జరుపుతున్నారు. మరోవైపు తాజా మాజీ సర్పంచులు రిజర్వేషన్లు కల్పిస్తే తిరిగి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పోటీ చేసేందుకు యువకుల ఆసక్తి..

రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ముఖ్యంగా యువకుల ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో వాట్సాప్‌గ్రూప్, ఫేస్‌బుక్, మెసేజ్‌లు పెడుతున్నారు. గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసేవారు ఎలాంటి కార్యక్రమం చేపట్టాలనే అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే యువకులు, యువజన సంఘాలు, కుల సంఘాలు, శుభకార్యాక్రమాల్లో తన అనుచరులతో యువకులు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గ్రామాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు యువకులు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గతంలో పనిచేసిన సర్పంచులు ఏమి అభివృద్ధి చేయలేదని యువకులకు పట్టం కట్టినట్లయితే అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రశ్నించే తత్వాన్ని కట్టబెట్టాలని యువకులు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ గ్రూపుల్లో పెడుతున్నారు. తాజా మాజీలు సైతం రిజర్వేషన్లు అనుకూలంగా వస్తే కచ్చితంగా పోర్ట్ చేస్తామని ఇప్పటికే పాత గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులతో మంతనాలు జరుపుతూ తమదైన శైలిలో ముందుకెళ్తున్నారు.

ప్రజలు మాత్రం యువతకే పట్టం కట్టాలని ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఎన్ని హామీలు ఇచ్చిన పలువురు సర్పంచులు పదవి రాగానే ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇష్టానుసారంగా వ్యవహరించి గ్రామ అభివృద్ధిని మరిచిపోయి అడ్డగోలుగా సంపాదించుకున్నారని యువత మండిపడుతున్నారు. లక్షల రూపాయల ఈసరి వెనుకంచి వేసేది లేదని యువకులు పోటీ చేసేందుకు సై అంటున్నారు. ఇప్పటికే తమ మిత్రులతో బంధువులతో మంతనాలు జరుపుతున్నారు.

గెలుపు గుర్రాల కోసం పార్టీల అన్వేషణ..

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలు అధికార కాంగ్రెస్ పార్టీ, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలో బలమైన అభ్యర్థులను బరిలోకి దించి ఎట్టి పరిస్థితిలోనూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటడానికి గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలుపెట్టాయి. ఇప్పటికే గ్రామాల్లో అధికార పార్టీతో పాటు ఇతర పార్టీలో వారు గ్రామంలో సర్పంచ్‌గా ఎవరిని బరిలో దించితే గ్రామ అభివృద్ధికి ఏమైనా చేయగలడా అడిగి తెలుసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. అత్యధిక స్థానాలను గ్రామ పంచాయితీలను కైవసం చేసుకోవడానికి తమ పార్టీ తరఫున తన అనుచరులను బరిలోకి దించి కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతుంది. ఏదిఏమైనప్పటికి జూన్ మాసంలో జరిగే పంచాయతీ ఎన్నికలు షెడ్యూలు రాకముందే ప్రధాన పార్టీలు పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టడంతో పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి కనిపిస్తుంది. హెూటల్లో వద్ద కల్లు దుకాణం, రచ్చబండ, గ్రామపంచాయతీల వద్ద నలుగురు కూర్చున్న చోట ఉపాధి పనుల వద్ద ప్రజలు చర్చించుకుంటున్నారు

చెత్త చెదారం తొలగింపు

- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం కథనానికి స్పందన



చెత్తచెదారం తొలగింపుతో శుభ్రంగా మారిన స్థలం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. లింగంపేట్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధితో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తపై నవతెలంగాణ దినపత్రికలో 'గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం' అనే శీర్షికన కథనం సోమవారం ప్రచురితమైంది. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి మంగళవారం రోడ్డు కిరువైపులా పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించారు. చెత్తచెదారం రోడ్లపై, రోడ్డుకు ఇరువైపులా వేయవద్దని దుకాణ సముదాయాల నిర్వాహకులకు గ్రామపంచాయతీ సిబ్బంది సూచించారు. చెత్తను రోడ్డు పక్కన వేసినట్లయితే చర్యలు తీసుకుంటామని గ్రామపంచాయతీ కార్యదర్శి వారికి సూచించారు

ఐఐటీ పట్టా అందుకున్న భిక్కనూర్ విద్యార్థి



పట్టా అందుకుంటున్న విద్యార్థిని శ్రీలేఖ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణానికి చెందిన శ్రీలేఖ అనే విద్యార్థి భారతదేశంలో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ఒకటైన పాట్నా ఐఐటీ పదవ స్నాతకోత్సవంలో ఐఐటి పట్టా అందుకున్నారు. 2019 బ్యాచ్‌కు చెందిన శ్రీలేఖ జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటి పాట్నాలో కంప్యూటర్ సైన్స్ పూర్తిచేశారు. ఐఐటీ పాట్నాలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో జిల్లా నుంచి సీటు సంపాదించిన ఏకైక విద్యార్థిగా మన్ననలు పొందారు. ఈ సందర్భంగా శ్రీలేఖ మాట్లాడుతూ ఐఐటి పాట్నాలో చదివి పట్టా పొందడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. భిక్కనూర్ పట్టణానికి కేంద్రానికి చెందిన శ్రీలేఖ పట్టా పొందడం పట్ల పట్టణ ప్రజలు విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందిస్తున్నారు.

మహాపాదయాత్రకు ఆహ్వానం




ఆహ్వానపత్రికను అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి వెంకన్న ఆధ్వర్యంలో తేజ గురుస్వామి పాల్గొనవల్సిందిగా ఆహ్వానపత్రికను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తేజ హనుమాన్ స్వాముల కోరిక మేరకు పిట్లం మండలంలోని పోతిరెడ్డిపల్లి శ్రీ వీరాంజనేయ హనుమాన్ స్వామి ఆలయం నుంచి నిజామాబాద్ మీదుగా సారంగపూర్ హనుమాన్ మందిరం వరకు మహాపాద యాత్ర ఈ నెల 26న నిర్వహించనున్నట్టు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్



మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన గైని తుకారాం (30) హెూటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం పెద్దకొడప్‌గల్‌లో నివసిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలుండగా.. మొదటి భార్యకు ఒకబాబు, రెండో భార్యకు బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం రెండో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేక మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు తొలి రోజు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని(సి బి సి ఎస్) బిఏ, బీకాం, బీఎస్సీ, బిబిఏ కోర్సులకు రెండవ, నాలుగవ, ఆరవ, సెమిస్టర్, రెగ్యులర్ ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలు యూనివర్సిటీ పరిధిలో 38 సెంటర్లలో తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు 8931 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 8534 మంది విద్యార్థులు హాజరైనారు. 397 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 386 మంది విద్యార్థులు హాజరు 354 మంది విద్యార్థులు హాజరైయ్యారు. 32 మంది విద్యార్థులు హాజరు కాలేదని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

24న జనరల్ బాడీ సమావేశం

నవతెలంగాణ-జుక్కల్

ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యశోదా అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపిడివో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం జుక్కల్ ఎంపిపి కార్యాలయంలోని సమావేశ హాలులో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావ్ పాల్గొంటున్నారని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు ఒకరోజు ముందుగానే తమ తమ నివేదికలను ఎంపిడివో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్క శాఖకు సంబంధించిన అధికారులు తప్పక సమావేశానికి రావాలని, హజరు కానీ అధికారులపైన శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

24 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరుకాను న్నారని ఇందుకోసం 29 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం థియరీ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగునని ఆయన తెలిపారు. ఈ నెల 24న సెకండ్ లాంగ్వేజ్, 25న ఇంగ్లీష్, 28 న మాథ్స్ పేపర్-ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్, 29న మాథ్స్ పేపర్‌బి, జూలజి, హిస్టరీ, 30న ఫిజిక్స్, ఎకనామిక్స్, 31న కెమిస్ట్రీ, కామర్స్, జూన్ 1న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జ్ కోర్స్ మాథ్స్ (బై.పి.సి.), 3న మోడరన్ లాంగ్వేజ్, జియోగ్రఫీ పరీక్షలుంటాయని కలెక్టర్ తెలిపారు. కాగా ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4 నుంచి 8 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ ఉదయం 9 గంటలకు, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష 11న ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష 12న ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలుకు అనుమతి లేదని, ఎలక్ట్రానిక్స్ గాడ్జెస్ కూడా అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

జూన్ 3 నుంచి 13 వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు..

జూన్ 3 నుంచి 13వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, పరీక్షలకు హాజరయ్యే 869 మంది విద్యార్థులు కోసం కామారెడ్డి, బాన్సువాడ మండల కేంద్రాలలో ఒక్కో కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ మినహా అన్ని పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని, ఆ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జూన్ 3న ఫస్ట్ లాంగ్వేజ్, 5న సెకండ్ లాంగ్వేజ్, 6న థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లీష్, 7న మ్యాథ్స్ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. కాగా జూన్ 8న ఫిజికల్ సైన్స్, 10న బయాలజికల్ సైన్స్, 11న సోషల్ స్టడీస్, 12న సంస్కృత/అరబిక్ మొదటి పేపర్, 13న సంస్కృత, అరబిక్ రెండవ పేపర్ పరీక్ష జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలుకు అనుమతి లేదని, ఎలక్ట్రానిక్స్ గాడ్జెస్ అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

24 నుంచి ఫొటో, వీడియో గ్రఫీపై శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ నెల 24 నుండి ఉచిత ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీపై స్టేట్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డిచ్‌పల్లి ఆధ్వర్యంలో శిక్షణనివ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ గ్రామీణ ప్రాంతాలలో ఉండే నిరుద్యోగ యువకులకు మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్ శిక్షణ ఈ నెల 27 నుండి ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు.

రాజీవ్‌గాంధీ హయాంలోనే ఐటీ అభివృద్ధి



కామారెడ్డి : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కోటగిరిలో..

- రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. భారతదేశ సాంకేతిక అభివృద్ధికి ఆద్యుడు, ప్రజా పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన నాయకుడు, దేశ సౌభ్రాతృత్వం కాపాడటం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు.. మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులులర్పించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : ఐటీ రంగం అభివృద్ధిలో కీలక పరిణామాలు తీసుకొచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వర్ధంతిని ఘనంగా మంగళవారము నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాంబిగే హన్మాండ్లు మాట్లాడుతూ భారతదేశ రాజకీయ చరిత్రలో ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు చిప్ప శివ, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య మండల అధ్యక్షులు బొడ్డ రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బుర్రము బాలరాజ్, నీళ్లబోయిన ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివరాజ్ దేశాయ్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని అన్నారు. రాజీవ్‌గాంధీ 108 సేవలు ప్రారంభించారని దేశ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్‌ది అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, వెనిగళ్ళ సునీల్‌కుమార్, సాయిలు, కోటగిరి గ్రామ అధ్యక్షులు ఆనంద్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ హయాంలో దేశం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సయ్య, అబ్రబోయిన స్వామి, నల్లపు శ్రీనివాస్, అశబోయిన శ్రీనివాస్, నర్సరెడ్డి, అబ్రబోయిన రాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కోఆర్డినేటర్ కమిటీ ప్రెసిడెంట్ విఠల్‌రెడ్డి, క్రమ శిక్షణ కమిటీ మెంబర్ రామ చందర్‌రెడ్డి, వ ర్కింగ్ ప్రెసిడెంట్ వాసురెడ్డి, మైనార్టీ మండల ప్రెసిడెంట్ ఇమామ్, యూత్ మండల ప్రెసిడెంట్ శ్రీరామ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నా యకులు సుధాకర్, సురేందర్ గౌడ్, సంజీవులు, భాషమియా, గణేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ భారతదేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ రాజీవ్ గాంధీ పేద ప్రజలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడని, తాను ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి విశ్రాంతి లేకుండా తన చివరి ఊపిరి వరకు దేశం అభివృద్ధికి కృషి చేశాడని ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నాయక్, సిద్ధిరాములు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు నాగం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్: పట్టణంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, నాయకులు బాబు, మహేందర్, నవీన్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో..



నాగిరెడ్డిపేటలో..



పిట్లంలో..